క్లుప్తంగా

సూదివలసలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు: సూదివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వర్రి సన్యాసిరావు, రమణ తమ సొంత నగదు రూ.20 వేలతో ఐదు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో ప్రజలు కూర్చోవ డానికి వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. దాత లతో కలిసి ఎంపీటీసీ రామునాయుడు ఆది వారం ప్రారంభించారు. దాతలను గ్రామస్తు లు అభినందించారు.

ఎస్‌ఐకు ఘన వీడ్కోలు

మాకవరపాలెం: బదిలీపై వెళుతున్న ఎస్‌ఐ రామకృష్ణారావుకు ఘన వీడ్కోలు పలికారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న ఆయనకు ఇటీవల బదిలీల్లో భాగంగా రోలుగుంట ఎస్‌ఐ గా నియమించారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వహించిన రామకృ ష్ణారావుకు ఆదివారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు సిబ్బందితోపాటు రాజకీయ పార్టీల నేతలు ఘన సత్కారం చేశారు. పోలీసు ఉన్న తాధికారులతోపాటు వైఎస్సార్‌సీపీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 48 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ: స్థానిక అక్షరశ్రీ విద్యానికేతనలో ఆది వారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించా రు. 115 మందికి కంటి పరీక్షలు నిర్వహించా రు. వీరిలో 48 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికై నట్లు శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. గ్రామా నికి చెందిన ఇట్స్ మై విలేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు క్యాంపు నిర్వహణ ఏర్పాట్లు చేసి రోగులకు సహాయ సహకారాలం దించారు. యువకులు మధు, సిరికి నగేష్, కరగాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎస్‌ఐ దివ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాగాపురం నేతలు

గొలుగొండ: కృష్ణదేవిపేట ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన దివ్యను నాగాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం, పార్టీ నేతలు నాగాశ్వరరావు, శ్రీను, వరహాలు, కృష్ణ, లోవకుమార్, చిన్న, లోవ తదితర నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

కశింకోట : స్థానిక అగ్రహారం వీధిలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన భరత నాట్యం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మారుతి విద్యాపీఠం నిర్వాహకుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రదర్శించారు. విశాఖలోని భాగవతుల శిరీష బృందం భరత నాట్యాన్ని ప్రదర్శించింది.

దైవ చింతన అలవరచుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండ లంలోని ఉమ్మలాడలో శ్రీబాలగణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని ఆయన ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు మొల్లేటి శంకర్ పాల్గొన్నారు.



తాచేరు నది సమీపంలో సూరిశెట్టి వారి పొలంలో చెరకు తోటకు అందేలా ప్రధాన విద్యుత్ లైన్



చేతికందేలా ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపిస్తున్న రైతు వెంకట్రావు



చెరకు తోటలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

పొలాల్లో యమపాశాలు

- చెరకు తోటలకు అందే ఎత్తులో విద్యుత్ తీగలు
- పట్టించుకోని విద్యుత్ సిబ్బంది
- రక్షణ లేని మినీ ట్రాన్స్‌ఫార్మర్లు
- రైతుల ఇబ్బందులు

పొలాల్లో విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. ఇవి చెరకు తోటలకు తాకుతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.



తాచేరు గట్టు మీద రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

మాడుగుల రూరల్: పొలాల్లో విద్యుత్ ప్రధాన లైన్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇవి చెరకు తోటలకు తాకుతున్నాయి. గాలులు వీచినప్పుడు తీగలు నుంచి విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గుర వుతున్నామని రైతులు వాపోతున్నారు. కె.జె.పురం తాచేరు నది సమీపంలో సూరిశెట్టి పొలం, చుట్టు పక్కల భూముల్లో ప్రధాన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని రైతులు పరిమి బాబ్జి, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ తీగలు కిం దకు వేలాడుతుండటం వల్ల చెరకు జడ చుట్టు చేసు కోవడానికి ఆటంకం కలుగుతోంది. దీంతో పాటు ఇతర పొలాలు మీద తీగలు కిందకు వేలాడుతు న్నాయి. వీటిని సరిచేయాలని సంబంధిత అధికా రులకు మొరపెట్టుకున్నా సరే విద్యుత్ స్తంభాలు మార్పుకు నగదు చలానా తీయాలని చెబుతున్నార ని, అంత నగదు తామెక్కడ నుంచి తీసుకొస్తామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ప్రధాన విద్యుత్ తీగలను ఎత్తు చేయాలని, అవస రమైన చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తాచేరు నది ఒడ్డున మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేదని, వీటి చుట్టూ పొదులు అల్లుకోవడం వల్ల ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో చెప్పలేని స్థితిలో ఉన్నామని వాపో తున్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ తీగలు పూర్తిగా మార్పు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా తీగలు



మా చెరకు తోట కిందకు ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీనివల్ల చెరకు తోట చుట్టించుకోవాలంటే భయంగా ఉంటోంది. తోట చుట్టడానికి కూలీలు ఎవరూ రావడం లేదు. తీగలు సరిచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదు. తక్షణమే సరిచేయాలి. – బొడ్డేడ వెంకట్రావు, రైతు, కె.జె.పురం, మాడుగుల మండలం

షాక్‌కు గురయ్యాను



తోట జడ చుడుతుండగా విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యాను. కిందకు వేలాడుతున్న తీగలను వెంటనే మీదకు సరిచేయాలి. అధికారులు స్పందించి, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి. ప్రధాన లైను తీగలను కింద నుంచి మీదకు ఏర్పాటు చేయాలి. రైతులు సమస్యలు పరిష్కరించాలి. – సూరిశెట్టి రాము, రైతు, కె.జె.పురం, మాడుగుల మండలం

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం పంట పొలాలు ఉన్నాయి. విద్యుత్ తీగలు సరిచేయడానికి గాను మా సిబ్బందిని పంపించి సర్వే చేపడతాం. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి చోట విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి.
– ఎం. రాంబాబు, విద్యుత్ ఏఈ, మాడుగుల

సచివాలయ ఏఎన్ఎం మృతికి సంతాపం



మృతురాలు సత్యవతి

నాతవరం: స్థానిక గ్రామ సచివాలయం –1లో ఏఎన్ఎంగా పని చేస్తున్న ఎన్.సత్యవతి(40) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతూ ఆదివారం మరణించింది. ఆమె స్వగ్రామం నాతవరం మండలం మర్రిపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు సత్యవతి కుమారుడు కొంతకాలం క్రితమే మరణించాడు. భర్త నాగరాజు పక్షవాతంతో ఇంటి వద్ద మంచానికే పరిమితం కావడంతో భార్య మృతితో అతని పరిస్థితి అయోమయంలో పడింది. సత్యవతి మరణం పట్ల నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రాజేష్‌నాయుడు, ప్రసన్న, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సచివాలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా ప్రభావతి, నాయకుడు చెక్కా జోగిరాజు సంతాపం తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్నకు అభినందన



డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్నను శాలువాతో సన్మానిస్తున్న పడాల కొండలరావు

మాడుగుల రూరల్: జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన (డీసీసీ) మీసాల సుబ్బన్నను పీసీసీ మాజీ కార్యదర్శి పడాల కొండలరావు ఆదివారం నర్సీపట్నంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాంగ్రెసు పార్టీలో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్న సుబ్బన్నకు డీసీసీ అధ్యక్ష పదవి వరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. సుబ్బన్న హయాంలో జిల్లాలో పార్టీ బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కోటేశ్వరరావు, జగదీశ్ పాల్గొన్నారు.

అహింసామార్గంతో సమస్యలు దూరం



ఇంటింటి ప్రచారం చేస్తున్న మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్ చైర్మన్ జగపతిరాజు

కశింకోట : ధ్యానం, అహింసా మార్గం పాటిస్తే అన్ని సమస్యల నుంచి బయట పడవచ్చని మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్ సమితి చైర్మన్ దాట్ల రాయ జగపతిరాజు అన్నారు. మహా కరుణ యాగంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1200 గ్రామాల్లో నిర్వహించడానికి చేపట్టిన ఇంటింటి ధర్మ ప్రచార పాదయాత్ర ఆదివారం కశింకోటలోని గవరపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరూ ధ్యానం ఆచరించాలని, మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని భుజించాలని కోరారు. ధ్యాన సాధన వల్ల జ్ఞానం అలవడుతుందన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్‌ను బ్రహ్మర్షి పత్రీజీ స్థాపించి దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉచిత ధ్యాన శిక్షణ కేంద్రాలు నెలకొల్పి అందరికీ ధ్యాన విద్య అందిస్తున్నారన్నారు. ఆగస్టు 11న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వద్ద ఉన్న ప్రకృతి వ్యాలీ ధ్యాన శాఖాహార గ్రామం నుంచి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమానికి విశేష మహిళాదరణ లభించింది.

అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దూలం బూసిరాజు

అనకాపల్లి : ఆవ గర్భంలోకి వరద నీరు ప్రవహించే దారికి అడ్డంగా ఎటువంటి నిర్మాణాలు జరిపినా అనకాపల్లి పట్టణానికి పెద్ద ఎత్తును నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని అనకాపల్లి ఆవఖండ పరిరక్షణ సమితి కన్వీనర్ దూలం బూసిరాజు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆర్నాప్ ఎడిఫైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని బినామీ కంపెనీలు ఆవఖండం భూమి దురాక్రమణకు పాల్పడుతుంటే పెద్ద ఎత్తును ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఆవఖండంలో భవనాలు నిర్మించినట్లయితే అనకాపల్లి పట్టణం, మండలంలో తుమ్మపాల, శంకరం గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో అధికారులు ఆవఖండంలో ఎటువంటి నిర్మాణాలు జరపరాదని ఆదేశాలు జారీ చేయడంతో అవి నిలుపుదల అయ్యాయన్నారు. ప్రస్తుతం ఆవఖండం భూముల్లో అనధికార లేఔట్లు వేస్తున్న నేపథ్యంలో వాటిపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఈనెల 17 నుంచి ఉద్యమం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.ఎన్.భద్రం, కనిశెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, రాజాన దొరబాబు, శేఖరమంత్రి సాయి లక్ష్మణ్, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులకు ఆర్టీసీ బస్సులు నడపాలి

మాడుగుల రూరల్: ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాల వల్ల విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో నర్సీపట్నం, మాడుగుల బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. పాడేరు డిపోకు చెందిన బస్సులు చోడవరం నుంచి వరహాపురం, ఉప్పరగూడెం మీదుగా జైతవరం, అప్పలరాజుపురం, కె.జె.పురం మీదుగా ఘాట్‌రోడ్డు నుంచి పాడేరు నడుపుతున్నారు. ఇదే రహదారిపై మాడుగుల బస్సు సర్వీసులను నడపాలని ప్రజలు కోరుతున్నారు. బస్సులు నడపకపోవడం వల్ల విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు రోజూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. అనకాపల్లి డిపోకు చెందిన బస్సులు, మాడుగులకు గతంలో నడిపే మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను పాడేరు డిపో బస్సులు నడిపే రూట్‌లో నడపాలని కోరుతున్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం



బెల్ట్‌లకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నారాయణరావు

నర్సీపట్నం: రైయాన్ ర్యూ షోటోకాన్ కరాటే–డో ఇండియా ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో నర్సీపట్నం ఆర్పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు బెల్టులకు ఎంపికయ్యారు. వీరితో పాటు కోచ్ ఆర్.ప్రసాద్‌ను అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు. ఎల్లో బెల్టుకు ఎ.మనోజ్‌కుమార్, ఆరంజ్ బెల్టుకు ఎస్.హనైతీ, ఎన్.తనిష్‌చంద్ర, జి.భావాజ్ఞ, బ్రౌన్ బెల్టుకు ఎస్.పూజిత, ఎం.గిరిష్, పి.హర్ష వర్ధిని, పి.రఘురాజ్, ఎస్.యోహిత, ఎం.నిహాష్, జి.పూజ్యాన్విత ఎంపికయ్యారు.

సీపీఎం ఆధ్వర్యంలో నేటి నుంచి బైక్ ర్యాలీ



పార్టీ నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కమిటీ సభ్యుడు రాజు

నర్సీపట్నం: పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బైక్ ర్యాలీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నుంచి అచ్యుతాపురం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి విరాళాలు



శ్లాబ్ స్థాయికి చేరిన నిత్యాన్నదాన సత్రం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో సంతోషమాత ఆలయం పక్కన నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం భవనం శ్లాబ్ స్థాయికి చేరుకుంది. దాతలు ముందుకు వచ్చి నిర్మాణ పనులకు సహకరించాలని సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు దాతలకు విజ్ఞప్తి చేశారు. రూ. 25 లక్షలతో కింద అంతస్తులో అన్నదాన సత్రం, పై అంతస్తులో విశ్రాంతి భవనం నిర్మిస్తున్నామన్నారు. దాతలు విరాళాలను ఫోన్ పే 9849697916 నంబరుకు పంపించాలని కోరారు.

తరలిన గణనాథులు



ముషిడిపల్లిలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



తామరబ్బలో అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న సర్పంచ్ టోకురి రామకృష్ణ



రోలుగుంట: వెలంకాయలపాలెంలో అన్నసమారాధన

- వాడవాడలా నిమజ్జనోత్సవాలు, అన్న సమారాధనలు
- అన్ని దానాల కంటే అన్నదానం మిన్న
- ముషిడిపల్లి వినాయక మహోత్సవాల్లో పాల్గొన్న బూడి



కె.కోటపాడు: అనుపు పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులు



చీడికాడ: అర్జునగిరిలో అన్నసంతర్పణ జరుగుతున్న దృశ్యం

దేవరాపల్లి: అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. ముషిడిపల్లిలో వినాయక నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా వినాయక మం డపం వద్ద ఆదివారం నిర్వహించిన అన్న సమారా ధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధనను వడ్డన చేసి ప్రారంభించారు. ముందుగా స్థానిక నాయకులు, యూత్ సభ్యులతో కలిసి వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామాల్లో ఐక్యతగా వినాయక నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమ న్నారు. నాయకులు మతల మధు, బొడ్డు పెద అప్పారావు తదితర గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తామరబ్బలో భారీ అన్నసమారాధన....

వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తామరబ్బలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ టోకురి రామకృష్ణ, గుమ్మడపు మహేశ్వరరావు, కడారి రాజు, దేముడుబాబు తదితర స్థానిక గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గొండుపాలెంలో వినాయక నిమజ్జనం..

కె.కోటపాడు: గొండుపాలెంలోని పాతవూరులో కర్ణం గారి వీధిలో ఎర్పాటు చేసిన వినాయక విగ్రహం అనుపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు మహిళలు పూజలు చేశారు. అనంతరం మహిళల కోలాటాల నడుమ గ్రామ ప్రధాన వీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తూ అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కూండ్రపు సతీష్, రమేష్, పెద్దింటి రమేష్, బండారు రాము, శ్రీను, యాళ్ల నాయుడు, బండారు దేముడు బాబు, చలూమూరి, వెంకటరావు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో గణపతి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. దీనిలో భాగంగా వెలంకాయలపాలెం, నిండుగొండ, లగుడు కొత్తూరు గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కమిటీలు వడ్డనలు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

మాడుగుల/మాడుగుల రూరల్: స్థానిక మూడు రోడ్ల కూడలిలో బాలవినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నాలుగు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఇక్కడ 65 ఏళ్ల నుంచి వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. కె.జె.పురం శాలిపేట వీధిలో బాల వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

చీడికాడ: వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాత్రికి ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు ముగించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న నిర్లక్ష్యం



పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగ

కె.కోటపాడు: డి.అగ్రహారంలో ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చిమొక్కల మాటున దర్శనమిస్తోంది. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి మొక్క తీగలు ఎగబాకాయి. అసలే వర్షాకాలం కావడంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నట్లు గ్రామానికి చెందిన వేచలపు గోవింద్ వాపోయాడు. కూతవేటు దూరంలోనే ప్రాథమిక పాఠశాల ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కల వల్ల పాముల బెడద ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌పై మొక్క తీగల ను తొలగించి, పరిసరాలను శుభ్రపర్చాలని కోరుతున్నారు.